# మరో మహనీయుడు కావాలి

**అది వెన్నెల రాత్రి అందాల చందమామ దోబూచులాడుతూ కనిపిస్తున్నాడు. సుజాత మహాకవి గురజాడవారి "కన్యాశుల్కం" చదువుతూ అలా జారుకుంది నిద్రలోకి.**

ఆదమరచిన ఆ నిద్రలో కలగన్నది సుజాత- ఎవరో వచ్చి తలుపుతట్టినట్లు- తాను తలుపు తీసినట్లు- తను తలుపు తీయగానే ఎదురుగా నిల్చుంది గురజాడ వారి బుచ్చమ్మ. ఆశ్చర్యపోయింది సుజాత- అలా ఆశ్చర్యపోతూ మీరు బుచ్చమ్మగారుకదూ" అంది-

అవును- నేను బుచ్చమ్మనే- ఈరోజుల్లో- ఈలోకంలో, మీరంతా ఎలా ఉన్నారో చూసిపోదామని వచ్చాను- అంటూ లోపలికి చొరబడి వచ్చేసింది బుచ్చమ్మ.


లోపలికి వస్తూనే "స్నానంచేసి మడికట్టుకు వండుకుంటా బావి ఎక్కడే" అంది బుచ్చమ్మ.

"బావి, చెరువు ఎందుకండీ- చక్కగా స్నానాలగది చూపిస్తా రండి" అంటూ బాత్‌రూం చూపించింది సుజాత.

ఏమిషీ- స్నానాలకి గదులా- ఇంటిలోకే నీళ్ల రావటమా- కట్టెపుల్లలు- బొగ్గులు లేకుండానే- పొగలో సెగలో మగ్గకుండానే వంటలూ- వార్పులా- ఏమి సుఖం- ఈ రోజుల్లోని మన ఆడవాళ్లకు ఎన్ని సౌకర్యాలు వచ్చాయి. ఇదే మిషీ- ఇది పిండి రుబ్బుకునే మిషనా, ఎంతసులువు- ఆరోజుల్లో మేము చెమటలు కక్కుకుంటూ రుబ్బురోట్లో రుబ్బుకునేవాళ్లం-ఎంచక్కా పైన ఆ తిరిగే విసనకర్ర అదే ఫాన్‌గాలి విసురుతుంటే హాయిగా మిషనులో పిండి రుబ్బుకొని వంటలు చేసుకుంటారా! ఆహా ఎన్ని సుఖాలు ఈ కాలపు ఆడవాళ్లకి అన్నది బుచ్చమ్మ.

ఆ! ఏమి సుఖాలు బుచ్చమ్మగారూ. మీ కాలంలో ఆడపిల్లల్ని అమ్ముకొని బాల్య వివాహాలు చేసి ఎంతోమంది బాల వితంతువులని తయారుచేశారు. ఆ దురాచారాన్ని నడుంకట్టి కలంపోటుతో మహాకవి గురజాడ 'కన్యాశుల్కం' పేరుతో ఉద్యమించి ఎంతోమంది తలరాతల్ని మార్చారు. మరి కందుకూరి వారు అదేవిధంగా బాలవితంతువుల పునర్వివాహోద్యమం జరిపించి పునర్జీవనం కలిగించారు. మరి ఈనాడో అంటూ ఆగిపోయింది.

ఇప్పుడేమయింది అని అడిగింది బుచ్చమ్మ- ఏముంది, ఇప్పుడు వరకట్నం అంటూ లక్షలకి లక్షలు కట్నాల పేరుతో మగపిల్లల్ని అమ్ముకుంటున్నారు. అలా ఇచ్చుకోలేని నిర్భాగ్యులకి పుట్టిన ఆడపిల్లలు అవివాహితులుగా మిగిలిపోతున్నారు.



అప్పోసప్పో చేసి కట్నాలు ఇచ్చి పెళ్లిళ్లు జరిపించుకున్న పిల్లలయినా సుఖపడుతున్నారా అంటే అదీలేదు.

ఎందుకని- అన్నది బుచ్చమ్మ.

ఇచ్చింది చాలదనో- తక్కువనో- లేక మరింత కావాలనో ఆడపిల్లలని అత్తవారిళ్లల్లో వేధిస్తున్నారు. ఎంతోమంది నరకయాతనలనుభరిస్తున్నారు. మరీ దుర్భరమయినప్పుడు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు.

కొంతమంది డబ్బుకోసం అత్తవారిళ్లల్లో హత్యకు గురయి ఆత్మహత్యగా చిత్రింపబడుతున్నారు. ఎక్కడుంది స్త్రీలకు సౌఖ్యం- అంతెందుకు- మా కుటుంబమే చూడండి. మేము నలుగురు అక్కచెల్లెళ్లం- మాది మధ్యతరగతి కుటుంబం- మాకు విద్యాబుద్ధులు నేర్పించారు.

మాకు ఉన్నంతలో మా పెద్దక్క పెళ్లి ఘనంగా జరిపించారు. ఆమె భర్త తాగుబోతు- వ్యసనపరుడు- ఇక మా అక్కకు నిత్యమూ నరకప్రాయమే- ఇద్దరు పిల్లలతో నరకం అనుభవిస్తోంది.

మా రెండో అక్క భర్త మంచి విద్యావంతుడు. ఉన్నతోద్యోగి- మా అక్క కూడా టీచరుగా పనిచేస్తోంది. రోజూ మా అక్కను అనుమానిస్తూ నానామాటలతో వేధిస్తున్నాడు ఆమె భర్త. ఏమీ చేయలేక తన కొడుకు కోసం బతుకు వెళ్లదీస్తోంది. ఇక మా మూడో అక్క భర్త కట్నకానుకలు చాలవనీ, ఇంకా తీసుకురమ్మనీ రోజూ వేధింపులకు గురవుతోంది. అడిగినంత ఇచ్చారు. అయినా చాలదట. ఇంకా కావాలిట. అంతులేని దాహం- అందుకు బలి అవుతోంది మా అక్క. ఇక నేను నాలుగోదాన్ని. బాగా చదువుకున్నాను. పోస్టు గ్రాడ్యుయేషన్ చేశాను. కంప్యూటర్స్ చేశాను. మంచిగా ఉద్యోగం చేసి మా తల్లిదండ్రులకు చేదోడు వాదోడుగా ఉండాలని నా ఆశయం- కానీ ఉద్యోగ ప్రయత్నంలో ఎక్కడికెళ్లినా వాళ్ల వెకిలిచేష్టలూ, వింత ప్రవర్తనలూ- పిచ్చి చూపులూ కంపరం పుట్టిస్తున్నాయి.

నిబ్బరం లేకుండా చేస్తున్నాయి. ఒక్కొక్కప్పుడు అనిపిస్తుంది. మా బతుకులు చూస్తుంటే- భగవంతుడా- ఎందుకు

కె. అలివేలుమంగ

మాకీ జన్మనిచ్చావు. ఎందుకు మాకీ ఆడజన్మ- అవమానాలకీ (ఆత్మ)హత్యలకీనా- మాకు విలువలేదా- మాతో డబ్బు సంచులుంటేగానీ మేము పనికిరామా అని-

బుచ్చమ్మ అందుకొని- తప్పు తల్లీ సంసారానికి- సమాజానికి స్త్రీ పురుషులిద్దరూ అవసరమే. భగవంతుని దృష్టిలో అందరూ సమానమే- భగవంతునికి జాతి, మత, కుల, స్త్రీ పురుష వివక్ష లేదు. ఇవన్నీ మనం కల్పించుకున్నవే- ధనవంతుడు- ధనహీనుడు అన్న వివక్ష దేవునికి లేదు. ఇదంతా మనవాళ్లు కల్పించుకున్నవే- స్త్రీపురుషులలో ఏ ఒక్కరు లేకపోయినా ఈ సమాజమే లేదు- అయినా మీలో 33 శాతం రిజర్వేషన్లు- ఆస్తి హక్కులు- చట్టసభలలో ప్రవేశం కల్పిస్తున్నారు గదా! అన్నది బుచ్చమ్మ.

ఎక్కడండీ- ఆస్తిహక్కు చట్టంలో ఇస్తే సరిపోయిందా- ఎంతమంది పంచి ఇస్తున్నారు. ఎంతమంది అడిగే హక్కు స్తోమత లేక వదులుకుంటున్నారు. ఇక రిజర్వేషన్లూ అంతే- బస్సులో మాకు కేటాయించిన సీట్లలో పురుష పుంగవులు కూర్చుని ఖాళీ చేయమంటే వేసే వేషాలు, చేసే ఎగతాళులూ ఎలా భరించాలి. ఇక చట్టసభలలో రిజర్వేషన్ కల్పించటం ఒక ప్రహసనంగా మారి వాయిదాలు వేయటం లేదా! అంతే తెలిసి ఎందుకిలా మీరు గూడా వెక్కిరిస్తారు. బుచ్చమ్మగారూ- అయినా మీ కాలంలో మీకు సహాయం చేయటానికి, మిమ్మల్ని ఉద్ధరించటానికి మహాకవి గురజాడ- సంఘ సంస్కర్తలు రాజా రామ్మోహన్‌రాయ్ కందుకూరి వీరేశలింగంలాంటి ఉద్దండులు- కలంపట్టి పుంఖాను పుంఖాలుగా రచించి, ప్రజలలో చైతన్యం కలిగించిన స్వార్థరహిత ప్రజాసేవకులు- సంఘ సంస్కర్తలు వారు- ఆనాటి సాంఘిక దురాచారాల్ని రూపుమాపిన మహనీయులు- మరి నేడు కూడా మమ్మల్ని ఉద్ధరించటానికి నేటి స్త్రీలను సంఘ దురాచారాల నుంచి కాపాడటానికి మాకు కావాలి మరో మహనీయుడు అంది సుజాత.

అవును- అంటూ అంతర్ధానమయింది బుచ్చమ్మ. బుచ్చమ్మగారూ! అంటూ తెప్పరిల్లింది సుజాత- ఇది కలయేనా! కాదు- కారాదు. ఇది కలకారాదు- నిజం కావాలి- మరో మహనీయుడు రావాలి అంటూ బిగ్గరగా అరచింది సుజాత.

ఉలిక్కిపడి ఆ రూంలోకి వచ్చారు సుజాత తల్లిదండ్రులు. ●

